సాక్షి రంగారెడ్డి
గురువారం । 9 । మార్చి । 2023



వీధి కుక్కల వీరంగం

సైంటిస్టులు, ఇంజనీర్లు, మేధావులు ఉండే కంచన్‌బాగ్ ల్యాబ్. క్వార్టర్స్ వీధి కుక్కలకు నిలయంగా మారింది. 8లో▸



కరాటేతో ఆత్మరక్షణ

ఆత్మరక్షణకు కరాటే ఉపయోగపడుతుందని తెలంగాణ స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. 8లో▸

ఓయూలో బీఫార్మసీ కోర్సు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ టెక్నాలజీ కాలేజీలో ఈ విద్యా సంవత్సరం నుంచి బీఫార్మసీ కోర్సు ప్రారంభం కానున్నది. ప్రస్తుతం కళాశాలలో ఫార్మసీ విభాగంలో కొనసాగుతున్న ఎంఫార్మసీ కోర్సుతోనే మొదటి సంవత్సరం బీఫార్మసీ కోర్సు ప్రారంభించనున్నారు.

ప్రచార హోరు

విజయం కోసం శ్రమిస్తున్న టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులు

- ఇంటింటికీ తిరిగి మద్దతు కోరుతున్న ప్రధాన పార్టీలు
- 13న ఎలక్షన్
- జిల్లా వ్యాప్తంగా 31 పోలింగ్ సెంటర్లు
- బరిలో 21 మంది అభ్యర్థులు
- 16న సరూర్‌నగర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపు

ఎమ్మెల్సీ ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు. ఈ ఎన్నికలకు రాజకీయ పార్టీలతో ప్రత్యక్ష సంబంధం లేకపోయినా.. ప్రధాన పార్టీలన్నీ తమతమ మద్దతుదారులను రంగంలోకి దింపాయి. వీరికి పరోక్షంగా ఆర్థిక వనరులను సమకూరుస్తున్నాయి. సిట్టింగ్ స్థానాన్ని ఎలాగైనా మళ్లీ తమ ఖాతాలో వేసుకోవాలని అధికార బీఆర్ఎస్ ప్రయత్నిస్తుండగా.. బీజేపీ, సీపీఎం, సీపీఐ అనుబంధ సంఘాలు సైతం తాము బలపర్చిన అభ్యర్థుల విజయం కోసం శ్రమిస్తున్నాయి.

సాక్షి, రంగారెడ్డి జిల్లా: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శాసన మండలి ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. మరో నాలుగు రోజుల్లో ప్రచార పర్వానికి తెర పడనుంది. సోమవారం ఉదయం 8నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ కొనసాగుతుంది. మొత్తం 29,720 మంది ఓటర్లు ఉండగా, వీరిలో ఒక్క రంగారెడ్డి జిల్లా పరిధిలోనే 9,186 మంది ఉన్నారు. ప్రతీ పదహారు కిలోమీటర్లకు ఒక పోలింగ్ కేంద్రం చొప్పున జిల్లా వ్యాప్తంగా 31 సెంటర్లు ఏర్పాటు చేశారు. సాధారణ ఎన్నికల మాదిరిగానే ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను నియమించారు. 16న సరూర్‌నగర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు.

విందులు.. హామీలు

ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలు, ఉపాధ్యాయ సంఘాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి.. తమకే ఓటు వేయాలని అభ్యర్థించారు. టీచర్ల ఇంటింటికీ వెళ్లి తమను గెలిపిస్తే ఇది చేస్తాం.. అది చేస్తాం అంటూ హామీలు గుప్పిస్తున్నారు. కొంత మంది అభ్యర్థులు ఓటర్లను విందులు, వినోదాలతో ముంచెత్తుతున్నారు. ఎన్నికల ప్రచారం పేరుతో సాయంత్రం వేళ సమావేశాలు ఏర్పాటు చేసి.. బీరు.. బిర్యానీలతో మచ్చిక చేసుకుంటున్నారు.

ఆ ముగ్గురి మధ్యే పోటీ

మూడు జిల్లాల పరిధిలో మొత్తం 21 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో టీఎస్ యూటీఎఫ్ తరఫున పాపన్నగారి మాణిక్‌రెడ్డి, పీఆర్‌టీయూ టీఎస్ నుంచి చెన్నకేశవరెడ్డి, టీపీఆర్‌టీయూ అభ్యర్థిగా ప్రస్తుత మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి బరిలో ఉన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం అభ్యర్థిగా ఏవీఎన్ రెడ్డి, టీయూటీఎఫ్ అభ్యర్థిగా దేవన్నగారి మల్లారెడ్డి, ఎస్టీయూ నుంచి భుజంగరావు, మహబూబ్‌నగర్ నుంచి గతంలో పోటీ చేసిన రిటైర్డ్ డీఈఓ విజయ్‌కుమార్, హర్షవర్ధన్‌రెడ్డి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. గత ఎన్నికల్లో 12 మంది అభ్యర్థులు బరిలో నిలవగా, వీరిలో జనార్దన్, మాణిక్‌రెడ్డి, ఏవీఎన్‌రెడ్డి మధ్య తీవ్రపోటీ జరిగింది. తొలి ప్రాధాన్యత ఓట్లు పెద్దగా దక్కకపోయినా.. రెండో ప్రాధాన్యత ఓట్లతో జనార్దన్‌రెడ్డి విజయం సాధించారు. ఈసారి ఎన్నికల్లో కూడా మళ్లీ ఆ ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ ఉండనున్నట్లు ప్రచారం సాగుతోంది.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరీశ్

జిల్లాలో ఓటర్లు ఇలా..

డివిజన్	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు
షాద్‌నగర్	239	174	1
చేవెళ్ల	196	174	-
రాజేంద్రనగర్	812	1,006	-
ఇబ్రహీంపట్నం	1,260	767	-
కందుకూరు	2,363	2,101	-

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు
మహబూబ్‌నగర్	15	3,461
నాగర్‌కర్నూల్	14	1,822
వనపర్తి	07	1,335
జోగులాంబ	11	877
నారాయణపేట్	05	664
రంగారెడ్డి	31	9,186
వికారాబాద్	18	1,890
మేడ్చల్	14	6,536
హైదరాబాద్	22	3,949

పోలింగ్ కేంద్రాలు

- షాద్‌నగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో 507 మంది ఓటర్లు ఉండగా, కొత్తూరు, కొందుర్గు, కేశంపేట్, ఫరూఖ్‌నగర్ ఉన్నత పాఠశాలల్లో పోలింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు.
- చేవెళ్ల పరిధిలో 370 మంది ఓటర్లు ఉండగా, షాబాద్ బాలికల ఉన్నత పాఠశాల, చేవెళ్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీ, శంకర్‌పల్లి బాయ్స్ హైస్కూల్, మొయినాబాద్ మెథడిస్ట్ రూరల్ చిల్డ్రన్స్ హైస్కూల్‌ను ఎంపిక చేశారు.
- ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో 2,027 మంది ఓటర్లు ఉండగా, యాచారం, మంచాల, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, మాడ్గుల ఉన్నత పాఠశాలలో పాటు అబ్దుల్లాపూర్‌మెట్ ఎంపీపీఎస్‌ను ఎంపిక చేశారు.
- రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో 1,818 మంది ఓటర్లు ఉండగా, శంషాబాద్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ, జెడ్పీహెచ్ఎస్ నార్సింగి, రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలను పోలింగ్ స్టేషన్లుగా ఎంపిక చేశారు.
- కందుకూరులో అత్యధికంగా 4,464 మంది ఓటర్లు ఉన్నారు. వీరికోసం ఆమనగల్లు, మహేశ్వరం, జిల్లెలగూడ, కందుకూరు ఉన్నత పాఠశాలలతో పాటు సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ స్కూల్, నేతాజీనగర్‌లోని సంస్కృతి స్కూల్‌లో పోలింగ్ నిర్వహించనున్నారు.

ప్రశాంతంగా నిర్వహించండి

ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ హరీశ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం తన కార్యాలయంలో అదనపు కలెక్టర్లు ప్రతీక్‌జైన్, తిరుపతిరావు, డీఆర్‌ఓ హరిప్రియ, నోడల్, పోలీసు అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. సెంటర్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని, వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు.

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో షబ్ ఏ బరాత్



ముస్లింలతో పోలీసు అధికారులు

పహాడీషరీఫ్: షబ్– ఏ– బరాత్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. వేడుకల నేపథ్యంలో రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్, జాయింట్ సీపీ వి.సత్యనారాయణ జల్‌పల్లి మున్సిపాలిటీలో మంగళవారం రాత్రి బందోబస్తును పర్యవేక్షించారు. షాహిన్‌నగర్, ఎర్రకుంటతో పాటు పహాడీషరీఫ్ దర్గాకు చేరుకుని వేడుకల నిర్వహణను పరిశీలించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వీరి వెంట మహేశ్వరం ఏసీపీ అంజయ్య, పహాడీషరీఫ్, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్ కుమార్, భాస్కర్, జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాదీ తదితరులు ఉన్నారు.

'ఆయుష్మాన్ భారత్'ను అడ్డుకోవడం దారుణం



జన ఔషధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కొత్తూరు: పేద, మధ్యతరగతి ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం అడ్డుకోవడం దారుణమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. కొత్తూరులో ఏర్పాటు చేసిన జన ఔషధి కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. జన ఔషధి కేంద్రాల్లో బ్రాండెడెకు ఏమాత్రం తీసిపోని విధంగా నాణ్యమైన మందులు, తక్కువ ధరలో లభిస్తాయన్నారు. దేశవ్యాప్తంగా వేలాది సెంటర్లు కొనసాగుతున్నాయని వివరించారు. వీటిలో సుమారు పద్నాలుగు వందల రకాల మందులు లభించనున్నట్లు పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో, రోడ్డు ఇతర ప్రమాదాల్లో గాయపడిన పేదలు ఆయుష్మాన్ భారత్ కార్డు ద్వారా సమీపంలోని ఉన్న కార్పొరేట్ ఆస్పత్రుల్లో సుమారు రూ.5 లక్షల వరకు ఉచితంగా చికిత్సలు పొందే అవకాశం ఉందన్నారు. ప్రపంచాన్ని వణికించిన కరోనా వ్యాధి నిర్మూలనలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యవహరించిన తీరును ప్రపంచ దేశాలు కొనియాడాయని గుర్తుచేశారు.

భూ బాధితులకు పరిహారం అందించండి



సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వెల్దండ, ఆమనగల్లు, మాడ్గుల మండలాల్లో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ– 82 కాల్వలో భూములు కోల్పోతున్న బాధిత రైతులకు వెంటనే పరిహారం అందేలా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన సీఎం పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

విద్యావ్యవస్థ నీరుగారుతోంది



మొయినాబాద్‌లో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

- అధికారంలోకి రాగానే సీపీఎస్‌ను రద్దు చేస్తాం
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో హర్షవర్ధన్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థన

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలలను మూసేస్తూ బీఆర్ఎస్ సర్కార్ విద్యా వ్యవస్థను నీరుగారుస్తోందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు ప్రతి తండా, గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేయగా.. తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ వాటిని మూసేయిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడంతో లక్షల మంది విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించే అవకాశం దక్కిందన్నారు. సీఎం కేసీఆర్ కేజీ టు పీజీ అని మాటలు చెప్పడం తప్ప ఆచరణలో మాత్రం లేదని ఎద్దేవా చేశారు. ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలని.. బీఆర్ఎస్ డబ్బు రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ సీఎం కేసీఆర్ డబ్బుతో ఓట్లు కొనే కుట్రకు తెరలేపారని ఆరోపించారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి విజయం కోసం పనిచేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 13న జరిగే ఎన్నికల్లో ఉపాధ్యాయులు హర్షవర్ధన్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపని స్పష్టంచేశారు. అధికారంలోకి రాగానే సీపీఎస్‌ను రద్దు చేసి, పాతపెన్షన్ విధానాన్ని అమలు చేస్తామన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేస్తామని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్, పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, ఎంపీటీసీ రాంరెడ్డి, నాయకులు మల్లేశ్‌గౌడ్, మహేందర్‌ముదిరాజ్, రవీందర్‌రెడ్డి, భిక్షపతి, ఓంరెడ్డి, రాజు, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో మహిళలకు ప్రాధాన్యం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



మహిళలతో కేక్ కట్ చేయిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కొత్తూరు: బీజేపీ ప్రభుత్వంలో మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా పలువురు మహిళలను సన్మానించి, వారితో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో మహిళలు అత్యంత కీలకరంగమైన రక్షణ వ్యవస్థలోని ఎయిర్‌ఫోర్స్, డిఫెన్స్ విభాగాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తున్నట్లు వివరించారు. ప్రతిఒక్కరూ మహిళలపై గౌరవంతో మెలగాలన్నారు. చెడు పోకడల కారణంగా ఇటీవల తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో మహిళలపై అఘాయిత్యాలు జరిగాయని ఆవేదన వ్యక్తంచేశారు. వీటిని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో అలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. బాలిక విద్యను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన బేటీ బచావో కార్యక్రమం దేశవ్యాప్తంగా సత్ఫలితాలు ఇచ్చిందని వివరించారు. మహిళా సాధికారిత కోసం కేంద్ర ఆవాస్ యోజన ద్వారా మహిళలు ఇళ్లు నిర్మించుకునేందుకు నిధులు మంజూరు చేస్తున్నట్లు స్పష్టంచేశారు. కానీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఈ పథకంపై పెద్దగా ప్రచారం చేయకపోవడంతో చాలామంది సద్వినియోగం చేసుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, అందె బాబాయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, నర్సింహాగౌడ్, మహేందర్‌రెడ్డి, ఉమాదేవి, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే మహిళాభ్యున్నతి

- భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా నీరు
- మహిళల భద్రతకు ప్రత్యేక షీటీమ్‌లు
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆరోగ్యలక్ష్మితో అండగా నిలుస్తున్నారు
- మహిళా దినోత్సవంలో మంత్రి సబితారెడ్డి



మహిళా దినోత్సవ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: మహిళా సాధికారత, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మీర్‌పేటలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఆడబిడ్డలు నీటి కోసం రోడ్డెక్కకుండా మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ మంచి నీరు సరఫరా చేస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కిందని తెలిపారు. మహిళల భద్రత కోసం షీటీమ్‌లు ఏర్పాటు చేసి, దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా లక్ష రూపాయలు అందజేస్తున్నారని చెప్పారు. గర్భం దాల్చిన రోజు నుంచి ప్రసవించే వరకు ఆరోగ్యలక్ష్మి పథకం కింద పోషకాహారం, మందులు పంపిణీ చేస్తున్నారని వివరించారు. ఆడబిడ్డ పుడితే రూ.13 వేల ఆర్థిక సాయంతో పాటు కేసీఆర్ కిట్ అందజేస్తున్నారని తెలిపారు. వ్యాపారం చేసుకోవాలనే మహిళల కోసం బీ– హబ్ ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తున్నారన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.750 కోట్ల వడ్డీలేని రుణాలు, అభయహస్తం కింద రూ.546 కోట్లు అందజేశామని తెలిపారు. మహిళలు రాజకీయంగా ఎదిగేందుకు స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. సమావేశానికి హాజరైన మహిళలు చప్పట్లతో సీఎంకు అభినందన లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, కమిషనర్ నాగేశ్వర్, డీఈ గోపీనాథ్, ఏఈ శ్రీనివాసులు, కార్పొరేటర్లు సిద్దాల లావణ్య, మాధవి, సౌందర్య, విజయలక్ష్మి, ధనలక్ష్మి ఉన్నారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నేత మృతి


శంకర్‌నాయక్ భౌతికకాయం వద్ద డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు

- నివాళులర్పించిన మంత్రి సబితారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మేయర్ పారిజాతరెడ్డి

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జాటోత్ శంకర్ నాయక్(55) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. పార్టీ బలోపేతానికి ఆయన అహర్నిశలు కృషి చేశారు. మంత్రి సబితారెడ్డికి విధేయుడుగా పనిచేశారు. ఆమె కాంగ్రెస్ వీడి టీఆర్ఎస్‌లో చేరినా శంకర్ నాయక్ కాంగ్రెస్‌లోనే కొనసాగారు. ఆయన మృతి పట్ల మంత్రి సబితారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, చిగురింత నర్సింహారెడ్డి, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఎనుగు జంగారెడ్డి, మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్ సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి, నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు నాయక్, మాజీ జెడ్పీటీసీ సేనావత్ ఈశ్వర్‌నాయక్, వైస్ ఎంపీపీ సునితా నాయక్, కేసీ తండా సర్పంచ్ మోతీలాల్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజునాయక్, కుమార్, జీ రామ్ నాయక్, వత్తుల నారాయణ, దశరథ తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కల వీరంగం

- కాంచన్‌బాగ్ పరిసరాల్లో 300లకు పైగా వీధికుక్కలు
- తరచూ పిల్లలపై దాడులు
- చర్యలు తీసుకోవాలని డిమాండ్

బడంగ్‌పేట్: సైంటిస్టులు, ఇంజనీర్లు, మేధావులు ఉండే కంచన్‌బాగ్ ల్యాబ్, క్వార్టర్స్ వీధి కుక్కలకు నిలయంగా మారింది. ఒకటా రెండా ఏకంగా మూడు వందలకు పైగా వీధికుక్కలు ఇక్కడ సంచరిస్తూ పిల్లలు, పెద్దలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇప్పటి వరకు కింది స్థాయి సిబ్బందితో పాటు జీహెచ్ఎంసీ అధికారులు, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి కుక్కల సమస్యను పరిష్కరించాలని లెక్కలేనన్నిసార్లు ట్విట్టర్, వాట్సాప్ మెసేజ్‌లు చేసినా పట్టించుకునే నాథుతే లేకుండా పోయారు. ఇటీవల క్వార్టర్స్‌లోని బాలుడిపై వీధికుక్కల దాడి చేసి గాయపరిచాయి. డిఫెన్స్ పోలీసు పహారాలో ఉంటున్న ల్యాబ్, క్వార్టర్స్‌లోకి అసలు కుక్కలు ఎలా ప్రవేశిస్తున్నాయో అంతుచిక్కడం లేదని అక్కడివారు వాపోతున్నారు. పిల్లలను ఆరుబయట ఆడుకోవడానికి పంపాలంటేనే భయమేస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. వీధి కుక్కల కారణంగా పిల్లలను బంధీలుగా చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. వీరంగం సృష్టిస్తున్న కుక్కలను బంధించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కుక్కలను పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


వీధి కుక్కల దాడిలో గాయపడ్డ చిన్నారి



జీహెచ్ఎంసీదే బాధ్యత



ఇప్పటి వరకు ల్యాబ్, క్వార్టర్స్‌లోని వందలాది మందిపై వీధి కుక్కలు దాడులు చేశారు. గతంలో పలుమార్లు జీహెచ్ఎంసీలో ఫిర్యాదులు చేశాం. కానీ పట్టించుకోలేదు. ప్రాణాలు పోయాక స్పందిస్తారా ? వీధి కుక్కలను నియంత్రించాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీ, ప్రభుత్వానిదే. లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తాం.

– రవి, బీజేపీ కంచన్‌బాగ్ డివిజన్ అధ్యక్షుడు

పాపం పసివాళ్లు

- గుండెపోటుతో తల్లి మృతి
- ఐదేళ్ల క్రితం తండ్రి దుర్మరణం
- అనాథలైన ముగ్గురు పిల్లలు




జంగమ్మ (ఫైల్)

షాబాద్: గుండెపోటుతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. అంతారం గ్రామానికి చెందిన సిరిగిరి జంగమ్మ(32) బుధవారం ఉదయం ఛాతి నొప్పి వస్తోందని ఇంటి నుంచి బయటకు వచ్చి కుప్పకూలిపోయి మృతిచెందింది. ఐదేళ్ల క్రితం ఆమె భర్త అంజయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. భార్యభర్తలు చనిపోవడంతో వారి ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. జంగమ్మ, అంజయ్య దంపతులకు ప్రశాంత్(13), శివ(06), లక్ష్మి(08)ఉన్నారు. వీరు ఉండటానికి ఇళ్లు కూడా లేదు. పూరి గుడిసెలో జీవనం సాగిస్తున్నారు. కూలి పనులు చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటోంది. జంగమ్మ మృతితో పిల్లలు అనాథలుగా మారారు. వీరి చదువు, పోషణకు దాతలు ముందుకు రావాలని సర్పంచ్ యాదమ్మ, మాజీ సర్పంచ్ దర్శనాల బుచ్చయ్య, నాయకులు కృష్ణ తదితరులు కోరారు.

ఆభరణాలకు మెరుగు దిద్దుతానని బురిడీ

- మోసాన్ని పసిగట్టిన మహిళలు
- నిందితుడికి దేహశుద్ధి
- పోలీసులకు అప్పగింత

కడ్తాల్: ఆభరణాలకు మెరుగులు దిద్దుతానని చెప్పి పలువురి మహిళలను బురిడీ కొట్టించిన వ్యక్తికి గ్రామస్తులు దేహశుద్ధి చేసిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మక్తమాధారం గ్రామంలో ఉదయం ఓ వ్యక్తి తిరుగుతూ ఆభరణాలకు మెరుగులు దిద్దుతానని మహిళలను నమ్మించాడు. అతని మాయ మాటలు నమ్మిన ముగ్గురు మహిళలు తమ ఆభరణాలు మెరిసేలా చేయాలని కోరారు. అలాగే వెండి గొలుసులను మెరుగు పెట్టాలని ఇచ్చారు. గ్రామానికి చెందిన ఓ మహిళ తన వద్ద ఉన్న 30 తులాల వెండి గొలుసును ఇచ్చింది. మెరుగు పెట్టిన తర్వాత తూకం వేస్తే 30 తులాల వెండి కాస్త 15 తులాలుగా ఉండడంతో అతన్ని నిలదీసింది. ఇలా ముగ్గురు మహిళలు మోసపోవడంతో ఒక్కసారిగా అనుమానం వచ్చి ఈ విషయం స్థానికులకు చెప్పారు. వారు నిందితున్ని పట్టుకొని నిలదీశారు. మహిళలను మోసం చేస్తావా అంటూ దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. జేబులో లభించిన ఆధార్ కార్డ్ ఆధారంగా అతని పేరు సుఖ్‌దేవ్ సింగ్, బీహార్ రాష్ట్రం అని తెలిసింది. పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.


నిందితుడు సుఖ్‌దేవ్ సింగ్

పడాల రామారెడ్డి కన్నుమూత


రామారెడ్డి (ఫైల్)

శ్రీనగర్ కాలనీ: పడాల రామారెడ్డి కళాశాలల వ్యవస్థాపకుడు పడాల రామారెడ్డి (94) బుధవారం వయోభారంతో కన్నుమూశారు. పశ్చిమగోదావరి జిల్లాలో జన్మించిన రామారెడ్డి న్యాయశాస్త్రంలో పట్టా తీసుకున్నారు. 1988లో అమీర్‌పేట ఎల్లారెడ్డిగూడలో మొట్ట మొదటి ప్రైవేట్ లా కళాశాలను పడాల రామారెడ్డి పేరిట నెలకొల్పారు. ఆయన హైకోర్టు లైబ్రేరియన్‌గా, జుడీషియల్ మేజిస్ట్రేట్‌గా కూడా పనిచేశారు. న్యాయశాస్త్రంపై ఉన్న పట్టుతో ఆయన సుమారు 120 లా పుస్తకాలను రచించారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రామారెడ్డి భౌతికకాయాన్ని పంజగుట్ట ద్వారకాపురికాలనీలోని ఆయన స్వగృహంలో అభిమానుల సందర్శనార్థం ఉంచారు. రామారెడ్డి లా కళాశాలలో చదువుకున్న ఎందరో వ్యక్తులు న్యాయమూర్తులుగా ఉన్నత శిఖరాలను అధిరోహించారు. ఆయన అంత్యక్రియలు గురువారం మహాప్రస్థానంలో నిర్వహించనున్నారు.

పోలీసుల అదుపులో నిందితులు

మణికొండ: పెట్రోల్ పంపులో పని చేసే వ్యక్తిపై దాడి చేసి..అతని మృతికి కారణమైన ముగ్గురు నిందితులను నార్సింగి పోలీసులు బుధవారం కస్టడీకి తీసుకున్నారు. సీఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జన్వాడ మెయిన్‌రోడ్‌లోని పద్మావతి ఫిల్లింగ్ స్టేషన్‌లో అదే గ్రామానికి చెందిన సంజయ్ పనిచేస్తున్నాడు. స్వైపింగ్ మిషన్ లేదనిక్యాష్ ఇవ్వమని అడిగిన పాపానికి అతన్ని కొట్టి చంపిన విషయం తెలిసిందే.

కరాటేతో మహిళలకు ఆత్మరక్షణ


కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు

స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య

షాద్‌నగర్: మహిళల ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందని తెలంగాణ స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తిన చెన్నయ్య అన్నారు. షాద్‌నగర్ పద్మావతి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో యుద్ధ విద్యలు నేర్చుకోవడం కూడా అంతే ముఖ్యమన్నారు. కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణతో పాటుగా ఆరోగ్య రక్షణకు ఎంతో దోహదపడుతుందన్నారు. రెడ్ బెల్ట్ విభాగంలో అక్షిత, మమత, హరిప్రియ, సాయిదీప్తి ప్రతిభ కనబరిచారు. వారికి బెల్టులు, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

మృతుడి ఆచూకీ లభ్యం


లక్ష్మయ్య(ఫైల్)

షాద్‌నగర్ రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల గేట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. ఎస్‌ఐ విజయ్ కథనం ప్రకారం.. మండలంలోని చింతగూడకు చెందిన లక్ష్మయ్య(60) కూరగాయాల వ్యాపారి. మంగళవారం బూర్గుల గేట్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లి పోయింది. ఈ ప్రమాదంలో లక్ష్మయ్య అక్కడికక్కడే మృతిచెందాడు.

నవీన్ హత్యలో సూత్రధారి ఎవరు?

యువతి పాత్రపై పోలీసులు ఆరా
- నేటితో ముగియనున్న హరిహరకృష్ణ కస్టడీ
- ఆ తర్వాత నిహారికనూ కస్టడీలోకి తీసుకోవాలని పోలీసుల నిర్ణయం

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఇంజనీరింగ్ విద్యార్థి నేనావత్ నవీన్ (22) హత్య కేసులో అసలు సూత్రధారి ఎవరనేది కనిపెట్టే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. మృతదేహాన్ని ముక్కలు చేయాలనేంత కక్ష, శరీర భాగాలను కాల్చిపాడేయాలనే కిరాతక ఆలోచన ఎవరిదనేది తేల్చేపనిలో పోలీసులు ముందుకు వెళ్తున్నారు. నవీన్ హత్య విషయం నిందితుడు పేరాల హరిహరకృష్ణ చెప్పే వరకూ యువతి కట్టా నిహారిక (ఏ–3)కు తెలియదని పోలీసులు ప్రాథమికంగా తెలుపుతున్నప్పటికీ.. ఆమె పాత్రపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. గత నెల 17న అబ్దుల్లాపూర్‌మెట్ శివారు ప్రాంతంలో నవీన్‌ను హరిహరకృష్ణ కిరాతకంగా హత్య చేసి, 24న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల ఎదుట లొంగిపోయిన సంగతి తెలిసిందే. ప్రేమించిన యువతి దూరమవుతుందనే కక్షతోనే నవీన్‌ను హరిహర హత్య చేసి ఉంటే.. హత్య అనంతరం మృతుడి తల, మొండం, పెదాలు, చేతివేళ్లు, మర్మాంగాలను కోసి, ఆయా భయానక ఫొటోలను యువతికి పంపించాల్సిన అవసరం ఏముందనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా ఆయా ఫొటోలు నిజమేనా? కాదా? అని ధ్రువీకరించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. 20వ తేదీన నిందితుడు హరితో కలిసి యువతి సంఘటనా స్థలానికి వెళ్లడంపై కూడా పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అలాగే నిందితులు డిలీట్ చేసిన సెల్‌ఫోన్ డేటాను రికవరీ చేసేందుకు పోలీసులు వారి సెల్‌ఫోన్లను ఫోరెన్సిక్‌కు పంపించారు. ఇదిలా ఉండగా.. ఈ కేసులో నిహారిక, హసన్‌ను పోలీసులు ఈ నెల 6న అరెస్టు చేసిన సంగతి తెలుసుకున్న నిందితుడు హరి..బుధవారం కస్టడీ విచారణలో ఆమె యోగ క్షేమాలు పోలీసులను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. హరికి న్యాయస్థానం అనుమతిచ్చిన ఏడు రోజుల పోలీసు కస్టడీ నేటితో ముగియనుంది. ఈ కేసులో యువతి పాత్రను లోతుగా దర్యాప్తు చేసేందుకు నిహారికను కూడా పోలీసు కస్టడీకి తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది.

వర్సిటీ విద్యార్థులను ప్రశ్నించి పోలీసులు..

ఇదిలా ఉండగా..నవీన్ చదివే మహాత్మాగాంధీ యూనివర్సిటీలో నవీన్ తోటి విద్యార్థులు, స్నేహితులను రాచకొండ పోలీసులు విచారించారు. గత నెల 17న హైదరాబాద్‌లో ఉంటున్న ఇంటర్మీడియట్ ఫ్రెండ్ హరిహరకృష్ణను కలిసేందుకు వెళ్తున్నానని చెప్పి నవీన్ వెళ్లాడని స్నేహితులు పోలీసులకు వివరించినట్లు తెలిసింది. తిరిగి రాకపోటంతో హరికి ఫోన్ చేయగా ప్రశ్నించగా.. నవీన్ తనను కలిశాడని, యువతి విషయంపై గొడవ జరిగిందని హరి తెల్పినట్లు పేర్కొన్నారని తెలిసింది. గంజాయి కావాలంటూ అబ్దుల్లాపూర్‌మెట్ వైపు వెళ్లాడని తప్పుడు సమాచారం ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు.

స్క్రాప్ గోదాంలో మంటలు

మహేశ్వరం: కాదు — **పహాడీషరీఫ్:** స్క్రాప్ గోడౌన్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. జల్‌పల్లి కమాన్ రోడ్డులో ఉన్న ఓ స్క్రాప్ దుకాణంలో బుధవారం మధ్యాహ్నం మంటలు అంటుకున్నాయి. నిమిషాల వ్యవధిలో దట్టమైన పొగలు వ్యాపించాయి. గోదాంలోని మూడు పాత బస్సులు, ఓ ట్రక్కు కూడా పూర్తిగా దహనమయ్యాయి. ఈ ఘటనపై ఫిర్యాదు అందకపోవడంతో ఎలాంటి కేసు నమోదు కాలేదు. కాగా జల్‌పల్లి మున్సిపాలిటీలో అక్రమంగా కొనసాగుతున్న ఇలాంటి గోదాములలో ప్రమాదాలు చోటు చేసుకోవడం నిత్యకృత్యమైంది.


స్క్రాప్ గోడౌన్‌లో దట్టంగా వెలువడుతున్న పొగ

మా భూములను కాపాడండి

- ఎమ్మెల్యేకు బాధిత రైతుల మొర
- విచారణ జరిపిస్తానని హామీ

చేవెళ్ల: తాము సాగు చేసుకుంటున్న భూముల్లోకి అక్రమంగా వచ్చి కబ్జా చేస్తున్నారని ముడిమ్యాల గ్రామానికి చెందిన రైతులు కావలి గోపాల్, సత్తయ్య, రమేశ్, వెంకటమ్మ వాపోయారు. బుధవారం బాధిత రైతులు ఎమ్మెల్యే కాలె యాదయ్య, చేవెళ్ల పోలీసులను కలసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబర్లు 164, 165లలో 21 ఎకరాల 2 గుంటల భూమి ఉందని తెలిపారు. ఈ భూమిని 1998లో హైదరాబాద్‌కు చెందిన తాజ్ అహ్మద్ అనే వ్యక్తికి అమ్మకానికి పెట్టినట్లు తెలిపారు. అప్పట్లో అతడు మా వద్ద నుంచి 11ఎకరాల 10 గుంటలు రిజిస్ట్రేషన్ చేసుకోగా డబ్బులు లేక మరో 9 ఎకరాల 32గుంటల భూమిని జీపీఏ చేసుకున్నట్లు తెలిపారు. ఒప్పందం మేరకు ఆరు నెలల్లో డబ్బులు చెల్లించాలని లేకుంటే జీపీఏ రద్దు అవుతుందని పత్రాలు రాసుకున్నట్లు చెప్పారు. ఆరు నెలల వరకు డబ్బులు ఇవ్వకపోడంతో జీపీఏను రద్దు చేసుకున్నామని తెలిపారు. తాము అమ్మింది 8 ఎకరాల 10 గుంటలు అయితే మాకు తెలియకుండానే 11 ఎకరాల 10గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని తెలిపారు. దీనిపై అతన్ని నిలదీసినట్లు చెప్పారు. దాదాపు 30 ఏళ్లుగా ఈ భూమిని తామే సాగు చేసుకుంటున్నామని రైతులు తెలిపారు. ఈ భూమిపై మాకు దాయాదుల మధ్య కేసు నడుస్తోందని తెలిపారు. కానీ కొందరు మాపై దౌర్జన్యం చేస్తున్నారని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన తాజ్ అహ్మద్‌ఖాన్ తమకు 21 ఎకరాల 02 గుంటల భూమిని అమ్మాడని, ఇందుకు సంబంధించిన అన్ని పత్రాలు ఉన్నట్లు తెలిపారు. కానీ గతంలో తమ వద్ద భూమి కొనుగోలు చేసిన వ్యక్తి తమ పొలాన్ని కలుపుకొని మరో వ్యక్తికి విక్రయించాడని ఆరోపించారు. వారు గొడవకు దిగుతున్నట్లు చెప్పారు. దీనిపై విచారణ జరిపి మాకు న్యాయం చేయాలని బాధిత రైతులు కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రికార్డులు పరిశీలించి న్యాయం చేయిస్తానని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా భూమి కొనుగోలు చేసిన తాజ్ అహ్మద్ ఖాన్‌ను వివరణ కోరగా తాను పూర్తి డబ్బులు చెల్లించి రైతుల వద్ద నుంచి భూములు కొనుగోలు చేసినట్లు తెలిపారు. తాజ్ ఆగ్రో ఫామ్స్ కంపెనీ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నానని తెలిపాడు. అందుకు సంబంధించిన అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయని అధికారులకు చూపిస్తానని అన్నాడు. కంపెనీ పేరుపై కొనడం వల్ల ధరణిలో పాస్ పుస్తకం రాలేదన్నారు. తిరిగి రైతుల పేర్ల మీద పాస్‌పుస్తకాలు రావటంతో వారు భూమి అమ్మలేదని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని వాటిని చూపేందుకు సిద్ధమని ప్రకటించాడు.


చేవెళ్ల పోలీస్‌స్టేషన్ వద్ద బాధిత రైతులు

యువకుడి హల్‌చల్

- ఇంటి స్థలం ఇవ్వాలంటూ టవర్ ఎక్కిన వైనం
- సర్పంచ్ హామీతో కిందకు


టవర్ ఎక్కిన విజయ్

చేవెళ్ల: తనకు చేవెళ్ల ఇంటి స్థలం ఇవ్వడం లేదని ఓ యువకుడు పోలీస్ స్టేషన్‌లోని పాత సిగ్నల్ టవర్ ఎక్కాడు. గ్రామస్తులు, పోలీసులు, సర్పంచ్ శైలజ యువకుడికి ప్లాటు ఇస్తామని హామీ ఇవ్వడంతో కిందకు దిగాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి చేవెళ్ల పోలీస్‌స్టేషన్ వద్ద చోటు చేసుకుంది. దాదాపు రెండు గంటల పాటు యువకుడు హంగామా చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. చేవెళ్ల మండలం ధర్మసాగర్ గ్రామానికి చెందిన సాలె విజయ్ కుమార్ నాలుగేళ్లుగా మండల కేంద్రంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. టైలర్ దుకాణంలో పని చేస్తు జీవనం సాగిస్తున్నాడు. తనకు ఇళ్లు లేదని స్థలం ఇవ్వాలంటూ పోలీస్‌స్టేషన్‌లోని పాత సిగ్నల్ టవర్ ఎక్కాడు. స్థలం ఇస్తేనే కిందికి దిగుతానని మొండికేశాడు. సర్పంచ్ శైలజ, వార్డు సభ్యులు ప్లాట్ ఇస్తామని చెప్పడంతో కిందికి దిగాడు. అతనికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


యువకుడి నుంచి పత్రం రాయించుకుంటున్న పోలీసులు